క్లుప్తంగా

రూ.5 లక్షలతో సీసీ కాలువ నిర్మాణం



మల్లయ్యపేటలో చేపడుతున్న సీసీ కాలువ నిర్మాణ పనులు

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని మల్లయ్యపేటలో సీసీ కాలువ నిర్మాణ పనులు శుక్రవారం చేపట్టారు. రూ.5 లక్షల మున్సిపల్ నిధులతో ఈ పనులు చేయిస్తున్నామని మున్సిపల్ ఎన్విరాన్మెంట్ ఏఈ భాగ్యలక్ష్మి తెలిపారు. గ్రామంలోని అన్ని మురుగుకాలువల నీటిని ఈ కాలువలోకి వచ్చేలా అనుసంధానం చేస్తూ ఆ మురుగు అంతా గ్రామ శివారు ప్రాంతాలకు తరలించేలా కాలువ నిర్మాణం జరుగుతోందన్నారు.

పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్మోహన్‌రావు

సంతకవిటి: మండలంలోని అక్కరాపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన రాగోలు కిరణ్‌కుమార్, ఎస్.భాస్కరరావుల కుటుంబాలను జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహన్‌రావు శుక్రవారం పరామర్శించారు. అనంతరం వారి మరణాలకు గల కారణాలను బాధిత కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వావిలపల్లి రమణ తదితరులు పాల్గొన్నారు.

48 మద్యంసీసాలు స్వాధీనం



పట్టుబడిన మద్యంసీసాలను చూపిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసరావు

రేగిడి: మండలంలోని చిన్నశిర్లాం గ్రామంలో ఓ వ్యక్తి అక్రమంగా తరలిస్తున్న 48 మద్యంసీసాలను శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ఇ.శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి, సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసి, రాజాం కోర్టుకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



గజరాయునివలసలో ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్న పోలీసులు

బాడంగి: మండలంలోని డొంకినవలస, వీరసాగరం, గజరాయునివలస గ్రామాల్లో పోలీసులు, కేంద్ర బలగాలతో కలిసి శుక్రవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరగడమే లక్ష్యంగా ఈ కవాతు ప్రదర్శన చేపడుతున్నామని బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు తెలిపారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, నిర్భయంగా ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకునేలా ధైర్యం కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఆర్.జయంతి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాసామగ్రి అందజేత



విద్యార్థులకు అందజేసిన క్రీడాసామగ్రితో సిబ్బంది

రేగిడి: మండలంలోని దేవుదల కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం, సంకిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సంకిలి ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారం, రమాదేవి ఫౌండేషన్ సంయుక్తంగా క్రీడాసామగ్రిని శుక్రవారం అందజేసింది. క్రికెట్, వాలీబాల్, చెస్ వంటి క్రీడా పరికరాలను అందజేసినట్లు ఆయా సంస్థల ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఏపీపీ పట్టాభిరామిరెడ్డి, హెచ్ఆర్ హెడ్ మేనేజర్ మురళీకృష్ణ, రమాదేవి ఫౌండేషన్ అధినేత రమాదేవి, ప్రిన్సిపాల్ లక్ష్మి, సర్పంచ్‌లు దుర్గమ్మ, బి.పట్టాభి, ఎంపీటీసీ మజ్జి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల హృదయాల్లో
సీఎం జగన్ స్థానం సుస్థిరం

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, రాజాం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్



రేగిడి: బొడ్డవలసలో ఎన్నికల ప్రచారంలో ఎంపీ బెల్లాన, ఎమ్మెల్సీ విక్రాంత్, ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్‌లకు ఘనస్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

రేగిడి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనదైన మార్క్ పాలనతో రాష్ట్ర ప్రజల హృదయాల్లో సుస్థిరమైన స్థానం సంపాదించుకున్నారని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, రాజాం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ ప్రశంసించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని సంకిలి, బొడ్డవలస, చిన్నయ్యపేట గ్రామాల్లో శుక్రవారం పర్యటించిన వారికి ఆయా గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన వారు ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మంచిని వివరించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని, ఆ దిశగా అనేకానేక కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందన్నారు. ఎన్నికల వేళ టీడీపీ కూటమి చెప్పే మాయమాటలు నమ్మి మోసపోవద్దన్నారు. ఎన్నికల మేనిఫెస్టోను ఓ బైబిల్‌గా, ఖురాన్‌గా, భగవద్గీతగా భావించి, అందులోని ప్రతీ హామీని నెరవేర్చిన సీఎం జగనన్నను మాత్రమే నమ్మాలని, ఆయననే మళ్లీ ఆశీర్వదించి మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఇటీవల జరిగిన సిద్ధం సభలతో పాటు ప్రస్తుతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం పేరిట చేపడుతున్న బస్సుయాత్రకు జనాల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని, సభలకు వచ్చే జనాలను చూసి ప్రతిపక్షాలకు వెన్నులో వణుకుపుడుతోందన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మేలును చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని దుష్ప్రచారాలతో ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని, అయితే వాటిని ప్రజలెవరూ నమ్మడం లేదన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ విజయభేరి మోగించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు కె.వి.సూర్యనారాయణరాజు, వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు, మండల యూత్ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ కింజరాపు సురేష్, సర్పంచ్ బుడుమూరు పట్టాభి పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి




రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్‌కి తన మద్దతు తెలుపుతున్న శ్రీనివాసరావు

రాజాం: దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెంటే దివ్యాంగులంతా ఉన్నారని, ఆయనను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు సిద్ధంగా ఉన్నారని రాజాం దివ్యాంగుల సంక్షేమ సంఘం సభ్యుడు, అంతకాపల్లి గ్రామవాసి వాకముల్ల శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్‌ను ఆయన శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి, మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏరియా ఆస్పత్రుల్లో ఎటువంటి ఇబ్బందులు, పైరవీలు లేకుండా అర్హులకు సదరం ధ్రువీకరణ పత్రాలు అందించారని, ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్లు, మరెంతో మంది దివ్యాంగులకు ఉపకరణాలు, ఇంటి వద్దకే వైద్యసేవలు అందించడం జరిగిందన్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో లబ్ధి పొందిన వారంతా ఫ్యాన్ గుర్తుకే మళ్లీ ఓటు వేసి, గెలిపిస్తామన్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ రాజాం రూరల్ అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, అంతకాపల్లి సర్పంచ్ వాకముల్ల చిన్నంనాయుడు, ఎంపీటీసీ బొరోతు కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లోనూ ఫ్యాన్ గుర్తుకే ఓటేయండి



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం చేసిన మేలును వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

మెంటాడ: రానున్న ఎన్నికల్లోనూ ఫ్యాన్ గుర్తుకే ఓటేసి, వైఎస్సార్ సీపీని మళ్లీ గెలిపించాలని పార్టీ మండల అధ్యక్షుడు రాయిపిల్లి రామారావు, మహిళా అధ్యక్షురాలు నాగమణి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని చింతాడవలస గ్రామంలో శుక్రవారం పర్యటించిన వారు ఇంటింటికీ వెళ్లి, ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. సీఎం జగనన్న చేసిన అభివృద్ధి, సంక్షేమం చూసి, సాలూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా బరిలో ఉన్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరను మరోసారి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రంలో ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, జేసీఎస్ కన్వీనర్ త్రినాథ ఎన్నికల ప్రచారం చేయగా, మరోవైపు మేడపల్లి గ్రామంలో వైస్ ఎంపీపీ ఈశ్వరరావు, మయూరి అప్పలనాయుడు, రత్నాకర్ నాయుడు ఎన్నికల ప్రచారం చేపట్టి, సీఎం జగనన్నను ఆశీర్వదించి, మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని అభ్యర్థించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు



మాట్లాడుతున్న సీఐ తిరుమలరావు

రామభద్రపురం: రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని సీఐ తిరుమలరావు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలు తీసుకోవడం వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. అతివేగం, అజాగ్రత్తగా వాహనాలు నడపడం వల్లే గురువారం రాత్రి కొట్టక్కి బ్రిడ్జిపై రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొట్టిన ఘటనలో ముగ్గురు యువకులు మరణించి, ఆయా కుటుంబాలకు తీవ్ర శోకం మిగిల్చారన్నారు. వాహనదారులంతా వాహనాలతో రోడ్లపైకి వచ్చేటప్పుడు ఒక్కసారిగా ఇంటి వద్ద కుటుంబం ఉందని, జాగ్రత్తగా వెళ్లాలన్న ఆలోచన చేయాలన్నారు. వాహనదారులకు తప్పనిసరిగా లైసెన్స్ ఉండాలన్నారు. అలాగే బైక్ నడిపేవారంతా హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని తెలిపారు. అలాగే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించి, ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సురేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలపై అవగాహన



ఎన్నికల నియమావళిని వివరిస్తున్న ఎస్‌ఐ జనార్దన్

వంగర: మండలంలోని కె.కొత్తవలస గ్రామంలో ఎన్నికల నిబంధనలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం విడుదల చేసిన ఎన్నికల ప్రవర్తనా నియమావళిలోని ప్రతీ నిబంధనలను తూ.చ. తప్పకుండా పాటించాలని సూచించారు. ఎన్నికల వేళ ఎక్కడా గొడవలు పడకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాలని కోరారు.

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

కొత్తవలస: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు హాజరు కానున్న విద్యార్థుల కోసం మండల కేంద్రంలోని భారత్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ ప్రతినిధి రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతీరోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు తరగతులను నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 99854 12929, 83310 00746 నంబర్లను సంప్రదించాలన్నారు.

గిరిజనులంటే అపారమైన గౌరవం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేతలు

బాడంగి: గిరిజనులంటే తమకు గానీ తమ పార్టీ నేతలకు గానీ అపారమైన గౌరవమని, వైఎస్సార్ సీపీ హయాంలో అన్నివర్గాల వారికి సముచిత గౌరవం ఇవ్వడం జరుగుతోందని మండల వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, ఎంపీపీ సలహాదారు తెంటు మధుసూదనరావు, కోడూరు, గజరాయునివలస సచివాలయ కన్వీనర్లు తెంటు సింహాచలం, మూడడ్ల భాస్కరరావు మీడియాతో శుక్రవారం మాట్లాడారు. ఇటీవల రామభద్రపురం మండలంలోని గిరిజన గ్రామాల్లో చేపట్టిన ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు గిరిజనులను హేళన చేసి మాట్లాడినట్లు గజరాయునివలస ఎంపీటీసీ, టీడీపీ నాయకుడు చేసిన ఆరోపణలను వారు తీవ్రంగా ఖండించారు. గతంలో రాజులు ఎన్నడూ గిరిజన గ్రామాలకు వెళ్లి, వారి బాగోగులు అడిగిన సందర్భాలు లేవని, అప్పట్లో కూడా ఎమ్మెల్యే శంబంగి హయాంలోనే గిరిజన గ్రామాలకు రోడ్లు, తాగునీరు వంటి సదుపాయాలు కల్పించడం జరిగిందని గుర్తు చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, ఆ పార్టీ నేతలే ఎస్సీలను, ఎస్టీలను అవమానించేలా మాట్లాడారని, ఎస్సీల్లో ఎవరైనా పుట్టాలనుకుంటారా అని చంద్రబాబు అన్నమాటలు గుర్తులేవా అని ప్రశ్నించారు. తమ ప్రియతమ నేత సీఎం జగనన్న అన్నివర్గాల ప్రజలను ఎంతో ఆప్యాయంగా పలకరిస్తూ వారి అభివృద్ధి, సంక్షేమం కోసం పాటుపడుతున్నారన్నారు. నిజనిజాలు ఏంటో తెలుసుకుని మాట్లాడాలని, ఒకరిపై విమర్శ చేసే ముందు ఒకటికి పదిసార్లు ఆలోచన చేసి చేయాలని హితవుపలికారు.

రంజాన్ వేడుకల్లో వైఎస్సార్ సీపీ నేతలు



మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్సీ విక్రాంత్, ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్

రాజాం: స్థానిక బొబ్బిలి రోడ్డు జంక్షన్‌లోని జామియా మసీదులో శుక్రవారం జరిగిన రంజాన్ వేడుకల్లో విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి ముస్లిం మతపెద్దలు ఘనస్వాగతం పలికి, అల్లాహ్ ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం వారు ముస్లి సోదరులంతా కలసిమెలసి ఐక్యంగా ఉండాలని కోరారు.

కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ పాలవలస గోపి, రాజాం ఏఎంసీ మాజీ డైరెక్టర్ మొహిద్దీన్, జామియా మసీదు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



పర్ల గ్రామంలో ఎంపీ బెల్లానకు పూలతో ఘనస్వాగతం పలుకుతున్న మహిళలు

చీపురుపల్లి: ఐదేళ్ల పరిపాలనలో సంక్షేమ పథకాలు అమలు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కోరారు. మండలంలోని పేరిపి, రావివలస, ఇటకర్లపల్లి, పర్ల పంచాయతీలతో పాటు చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని రెండవ ఎంపీటీసీ ప్రాంతంలో శుక్రవారం ప్రచారం నిర్వహించిన అనంతరం జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష నివాసం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ శిరీషతో పాటు మహిళలు విజయ తిలకం దిద్ది హారతులు పట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకం అందించిన ఏకైక ప్రభుత్వం జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. పార్టీలు, కులాలు, మతాలు చూడకుండా పథకాలు అమలు జరిగాయన్నారు. అభివృద్ధి విషయంలో కూడా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందన్నారు. కూటమి పేరుతో వచ్చే మోసగాళ్లను నమ్మొద్దని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు అందుబాటులో ఉంచుకోవాలి



ఉంగరాడలో వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీవో హరనాథరావు

రేగిడి: వేసవి ఎండల నేపథ్యంలో ఉపాధి హామీ పథకం పనుల ప్రదేశంలో తాగునీరు అందుబాటులో ఉంచుకోవాలని ఏపీవో హరనాథరావు సూచించారు. మండలంలోని ఉంగరాడ, గుళ్లపాడు, అంబఖండి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన శుక్రవారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. రోజురోజుకూ ఎండల తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. పనిచేసే చోట టెంట్లు ఏర్పాటు చేసుకోవాలని, అలాగే ప్రథమ చికిత్స కిట్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో టీఏ రాంబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ రామకృష్ణ, మేట్‌లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

వాడవాడలా గుడ్‌ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సర్వమానవాళి పాపాలు రూపుమాపేందుకు ఏసుక్రీస్తు శిలువపై మరణించిన రోజును గుర్తుచేసుకుంటూ ఏటా ఈ కార్యక్రమం జరుపుకుంటారు. ఈ నేపథ్యంలో మతవిశ్వాసులంతా శుక్రవారం ఉదయం నుంచి ఉపవాసాలు ఆచరించి, ఏసుప్రభువును ఆరాధిస్తూ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సాయంత్రం వీధుల్లో జీసస్ శిలువ మరణం వృత్తాంతం తెలిపే నాటికను అత్యద్భుతంగా ప్రదర్శించి, ఆ దేవాదిదేవుడి ప్రాణత్యాగం చేస్తూ పలికిన ఏడు మాటలను జ్ఞాపకం చేసుకున్నారు. ప్రభు చూపిన సన్మార్గంలో నడిచి, ఆదర్శవంతమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని మతపెద్దలు కోరారు.

– సాక్షి నెట్‌వర్క్



రాజాం సిటీ: జీసస్ శిలువ మోసిన ఘటనను కళ్లకుకట్టినట్లు ప్రదర్శిస్తున్న మతవిశ్వాసులు



బొబ్బిలి: మండల కేంద్రంలోని ఆర్‌సీఎం చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శంబంగి



రామభద్రపురం: ఆరికతోట చర్చిలో క్రీస్తు ఆరాధనలో పాల్గొన్న భక్తులు



తెర్లాం: కూనాయవలస క్రీస్తు ప్రార్థనా మందిరంలో గుడ్‌ఫ్రైడే ఆరాధనకు హాజరైన విశ్వాసులు



వంగరలో గుడ్‌ఫ్రైడే ర్యాలీలో భక్తులు



తెర్లాంలో ఏసుక్రీస్తుకు సిలువ వేయడాన్ని ప్రదర్శిస్తున్న దృశ్యం



బొబ్బిలి: బలిజిపేట రోడ్డులో ఏసుప్రభువు మరణ వృత్తాంతం వివరిస్తూ క్రైస్తవుల ర్యాలీ



బాడంగి: ముగడ చర్చిలో క్రీస్తు పాత్రధారితో యూదులు, భటులు



బాడంగి: కోడూరు వీధుల్లో జీసస్‌ను స్తుతిస్తూ ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు